క్లుప్తంగా

డ్రోన్ సర్వే ప్రారంభం



హంసవరంలో డ్రోన్‌తో రీసర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ మేరీ అవినాష్

తుని రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో చేస్తున్న రీ సర్వేతో గ్రామాల్లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హంసవరం సర్పంచ్ రాయి మేరీ అవినాష్ అన్నారు. మండలంలోని హంసవరంలో శనివారం డ్రోన్ సర్వేను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సర్వేతో రైతులకు తమ భూములపై సమగ్ర హక్కులు లభిస్తాయన్నారు. రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఇ.శంకర్, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గండేపల్లి: మండలంలో 521 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని ఎంఈఓ నాయక్ తెలిపారు. తెలుగు మీడియంలో 341 మంది, ఇంగ్లిషు మీడియంలో 180 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. గండేపల్లి పరీక్ష కేంద్రంలో 160 మంది, మల్లేపల్లిలో 147, తాళ్లూరు–175 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని వివరించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

ప్రత్తిపాడు: ఈ నెల 3వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 805 మంది, ఐదు ప్రైవేటు పాఠశాలల నుంచి 192 మంది వెరసి 997 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరు పరీక్షలు రాసేందుకు లంపకలోవ, ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒమ్మంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్టు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు.

5న జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

కోటనందూరు: ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. మండలంలో పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, కొత్తకొట్టాం, భీమవరపుకోట, ఎస్సార్‌పేట, జగన్నాథపురం, కోటనందూరు గ్రామాల్లోని ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, దళిత నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన జగ్జీవన్‌రామ్‌ను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీపీఐఎస్ అధ్యక్షుడు మోర్త అబ్బులు, మాలమహానాడు ఎస్సీసెల్ కోఆర్డినేటర్ కొప్పల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జగ్గంపేట: స్థానిక పోలీసు స్టేషన్, కార్ల స్టాండ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ అందరికీ సహకారం అందించే డ్రైవర్ వీరబాబు ఇటీవల మృతి చెందాడు. కాగా వీరబాబుది పేద కుటుంబం కావడంతో వారికి ఆర్థిక సాయం అందించాలని పోలీసులు భావించారు. ఈ మేరకు శనివారం మృతుడి భార్య వెంకటలక్ష్మికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు ద్వారా అందించారు. కార్ల స్టాండ్ యూనియన్ నాయకులు కూడా మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

కిర్లంపూడి: స్థానిక ఉమావైద్యనాదేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాదంపూడి నారాయణమూర్తి శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ప్రత్తిపాడు: బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్ కె.పద్మజకు శనివారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ కాన్వాయ్‌ను అడ్డగించి, రాళ్లతో దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుండల సాయికుమార్, పార్టీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు పాల్గొన్నారు.

సత్యకుమార్‌పై దాడి దారుణం

జగ్గంపేట: అమరావతి రైతులకు మద్దతు తెలిపిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ వాహనంపై అల్లరి మూకలు చేసిన దాడికి నిరసనగా జగ్గంపేటలో శనివారం బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ వద్ద నిరసన దీక్ష చేశారు. అనంతరం ఏఎస్ఐ నూకరాజుకు వినతిపత్రం సమర్పించారు.

ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ?

- తుని పట్టణంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్య
- విస్తరణకు నోచుకోని మెయిన్ రోడ్డు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు



తుని మెయిన్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

తుని: ప్రభుత్వాలు మారుతున్నా పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పట్టణ జనాభాతో పాటు వాహనాల సంఖ్య రెట్టింపు అయ్యాయి. ఇందుకు అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. మున్సిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రధాన రహదారుల్లో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు దశాబ్దాలుగా మెయిన్ రోడ్డు విస్తరణ జరగలేదు. ఇటీవల రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా విస్తరణ పనులకు నిధులు మంజూరు చేశారు. త్వరలో పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. తుని గ్రేడ్–2 మున్సిపాలిటీగా ఉన్నప్పటికీ ప్రత్యేక ట్రాఫిక్ విభాగం లేదు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి ప్రజా ప్రతినిధులు తీసుకువెళ్లారు. ప్రస్తుత సీఐ నాగ దుర్గారావు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు.

54 వేల మంది జనాభా

తుని పట్టణ విస్తీర్ణం 7.02 చదరపు కిలో మీటర్లు. జనాభా 54 వేల మంది ఉండగా 14 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ప్రతి కుటుంబానికి వాహనాలు ఉన్నాయి. రవాణా శాఖ నుంచి సేకరించిన సమాచారం ప్రకారం పట్టణంలో 9 వేల ద్విచక్ర వాహనాలు, 276 కార్లు, 115 భారీ వాహనాలు ఉన్నాయి. ఇవి కాకుండా తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, పాయకరావుపేట, శంఖవరం తదితర మండలాల నుంచి రోజుకు 25 వేల మంది వివిధ పనులపై తుని పట్టణానికి వస్తుంటారు. పదేళ్లలో వాహనాల సంఖ్య రెట్టింపు అయ్యింది. ఇందుకు అనుగణంగా రహదారులు లేవు. పట్టణంలో ఐదు ప్రధాన రోడ్లు ఉన్నాయి. వీటిలోనే ఎక్కువ వాహన రాకపోకలు సాగుతున్నాయి. జీఎన్‌టీ రోడ్డు, సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్డు, మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లు కీలకమైనవి. వీటిలో సూరవరం, ప్రకాశం రోడ్లను విస్తరించారు. మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లకు ప్రభుత్వం రూ.54 కోట్ల నిధులు మంజూరు చేసినా పనులు జరగలేదు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

ఇరుకైనా రహదారుల్లో భారీ వాహనాల రాకపోకలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విశాఖ జిల్లా పాయకరావుపేట మండలంలో ప్రైవేటు బల్క్ మందుల తయారీ పరిశ్రమ ఉంది. ఇక్కడ తయారైన బల్క్ మందులను కంటైనర్స్‌లో విశాఖపట్నం పోర్టుకు తరలించి, అక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముడి సరుకు, రసాయనాలు, మిషనరీ తదితర వస్తువులను పెద్ద ట్రాలీల్లో తుని పట్టణం మీదుగా రవాణా చేస్తున్నారు. పురపాలక సంఘం వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం, సాయంత్ర వేళల్లో విద్యార్థులు స్కూళ్లకు రాకపోకలు చేస్తారని, ఈ సమయంలో భారీ వాహనాలను నిలుపుదల చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేయాలి



పట్టణంలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేయాలి. అదనంగా ఎస్సై, సిబ్బంది అందుబాటులోకి వస్తారు. మెయిన్ రోడ్డు ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సమస్యను రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ట్రాఫిక్ విభాగం ఏర్పాటుకు కృషి చేస్తాం. పోలీసు ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించేందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా చర్యలు తీసుకుంటాం.

– కుసుమంచి సుబ్బరాయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తుని

సమస్య పరిష్కారానికి చర్యలు



పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి తలుపులమ్మ అలయం వరకూ సెంటర్ డివైడర్ ఏర్పాటు చేశాం. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ మెయిన్ రోడ్డులోకి వ్యాన్‌లు, ఆటోలను అనుమతించం. లోడింగ్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4 గటంల వరకూ తోపుడు బండ్ల వ్యాపారులకు అనుమతి ఉంది. ప్రజలు సహకరిస్తే అనుకూల ఫలితాలు వస్తాయి. తుని పోలీస్‌స్టేషన్‌లో 45 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో కొందరిని ఇతర ప్రాంతాలకు బందోబస్తు కోసం పంపుతున్నాం.

– నాగ దుర్గారావు, సీఐ, తుని

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



తపోవనం ఆశ్రమంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేద పండితులు

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శనివారం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైత్రమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించినట్టు సరస్వతీ మహా స్వామి తెలిపారు. పలువురు భక్తులు, వేద విద్యార్థులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఏలేశ్వరం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సిరిపురం గీతా ఆశ్రమం పీఠాధిపతి దయానందభారతీ స్వామి అన్నారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. భక్తులకు భగవద్గీత విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గా వెంకటప్రసాద్, కటకం కిరీటి, ఉడతల రమణారావు, మల్లేశ్వరి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక



శంఖవరంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక నగర కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ ములికి వెంకన్నతో పాటు 50 మంది టీడీపీ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే పర్వత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షమ పథకాలు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, నక్కా నాగేశ్వరరావు, బైరా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తమ ఎడ్ల జతలతో ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

తుని: పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసినట్టు ఆవోగా స్వచ్ఛంద సంస్థ తుని శాఖ అధ్యక్షుడు కడిమిశెట్టి సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహంలోని 25 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, ఇతర పరీక్ష సామగ్రి అందజేశామన్నారు. ఆవోగా సంస్థ సభ్యులు సురేష్, దాసరి నూకయ్యశెట్టి, జులారి రామకృష్ణ, వీరభద్రరావు, వెంకట సుబ్బారావు, జి.సురేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సిరిపురంలో చెంత నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

ఏలేశ్వరం: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జాన్.విక్టర్ అధికారులకు సూచించారు. మండలంలోని సిరిపురం, తూర్పులక్ష్మీపురం, యర్రవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామాల్లోని చెంత నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- యల్లమిల్లిలో శనగల కొనుగోలు ప్రారంభం



శనగల కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని యల్లమిల్లిలో శనగల కొనుగోలును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రైతులు తమ పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వం పంటలకు మద్దతు ధర చెల్లించడంతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పంట కొనుగోలు విషయంలో రైతులకు మేలు జరిగేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు. జెడ్.రాగంపేట వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో శనగల కొనుగోలు చేస్తున్నట్టు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఇసుకపల్లి మంజు తెలిపారు. ఈ ఏడాది సుమారు 250 మంది రైతులు శనగ పంటను సాగు చేశారని, క్వింటాల్ రూ.5335 చొప్పున కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, గ్రామ సర్పంచ్ నూకతట్టు నాగజ్యోతి సుబ్బు, ఉప సర్పంచులు కోన గంగాధర్, జాస్తి వసంత్, ఎంపీటీసీ గొల్లేపల్లి అశ్విని రవి, సొసైటీ చైర్మన్ కేతిన బాబి, ఎంపీడీఓ రామన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



రాజపూడిలో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మండలానికి నూతనంగా మంజూరైన 104 వాహనాన్ని రాజపూడి పీహెచ్‌సీ వద్ద శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వైద్యులు ప్రజల ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తామని తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సరిత, వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట వ్యవసాయి మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, ఎంపీడీఓ బి.హరికృష్ణ, రాజపూడి గ్రామ సర్పంచ్ బి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శంఖవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



శంఖవరంలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: పల్లెలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బైరా శ్రీరామమూర్తి, నక్కా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ శ్రీవల్లికి ఎమ్మెల్యే పరామర్శ

గోకవరం: ఎంపీపీ సుంకర శ్రీవల్లిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల ఎంపీపీ తల్లి గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో ఉన్న ఎంపీపీ శ్రీవల్లి, వీరబాబు దంపతులను ఎమ్మెల్యే పరామర్శించి తన సంతాపం తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ‘మనసున మనసై’ నాటిక



నాన్నా– నేను వచ్చేస్తా నాటికలో ఓ సన్నివేశం



కళాకారులను సన్మానిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పెద్దనాలపల్లిలో గొల్లపలి చెల్లయ్య మెమోరియల్ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ప్రదర్శించిన మనసున మనసై నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. అమెరికాలో నివాసం ఉంటన్న ఓ వ్యక్తి తన తల్లిని అక్కడకు తీసుకువెళ్లి పనిమనిషిగా చూసిన వైనం హృదయాలను ఆవేదనకు గురి చేసింది. ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోషియేషన్ వారు ప్రదర్శించిన మనుసున మనసై నాటికకు ఎండీ ఖాజావల్లీ దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అమృతలహరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాన్నా– నేను వచ్చేస్తా నాటిక ప్రదర్శించారు. పిల్లలను అతి గారాబంగా పెంచి పెళ్లిళ్లు చేసిన తర్వాత కాపురాన్ని నిలబెట్టుకోలేకపోవడం, అత్తవారి ఇంటి నుంచి నాన్నా– నేను వచ్చేస్తా అంటూ కూతురు చెప్పడం నాటకంలో ప్రధాన అంశం. పెళ్లంటే సర్దుబాటు, సంసారం అంటే దిద్దుబాటు అనే సూత్రాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో కళా పరిషత్ అధ్యక్షుడు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాకారంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమంద్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, కోట సుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యుడు పేరూరి బద్రీనారాయణ, ఏఈఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టా పుస్తకాలకు పూజలు

అన్నవరం: సత్యదేవుని నూతన చిట్టా పుస్తకాలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో పండితులు ఉదయం 9 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవారి పాదాల వద్ద చిట్టాపుస్తకాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తల మండలి సభ్యుడు బద్రీ నారాయణ, దేవస్థానం అధికారులు స్వామివారికి నగదు కానుకలు సమర్పించగా వాటిని చిట్టా పుస్తకాలలో నమోదు చేశారు.

రత్నగిరిపై పండిత సదస్యం

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం రత్నగిరి రామాలయంలో వేదపండిత సభ (పండిత సదస్యం) నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అమ్మవార్లు వెంట రాగా నవదంపతులు సీతారాములను రామాలయం నుంచి మండపంలోకి తీసుకువచ్చి వెండి సింహాసనంపై ప్రతిష్ఠించారు. అక్కడ సత్యదేవుడు, అమ్మవారు, సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. సీతారాములకు ఏఈఓ కృష్ణారావు పట్టువస్త్రాలను సమర్పించారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందించాలి

తొండంగి: శృంగవృక్షం నూకాలమ్మ జాతర సందర్భంగా జరిగిన ఘర్షణలో గాయపడిన బాధిత దళిత కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తొండంగిలో మృతుడు నడిపల్లి రాము పెద్దకర్మకు ఆయన హాజరయ్యారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శృంగవృక్షంలో బాధిత కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతున్నారని, వారికి ప్రభుత్వం నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. ఈ కేసులో నిందితులపై త్వరితగతిన చార్జిషీట్ వేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గ్రామ సర్పంచ్ సోమాల ప్రసాద్, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

ప్రత్తిపాడు: కేంద్రంలో మోదీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా ఈ నెల మూడో తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. అనంతరం అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతుల ఆందోళన

కాకినాడ సిటీ: పట్టాలిప్పిస్తానని రెండు వందల మంది రైతులను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు కోరుతూ జగ్గంపేట మండలం మల్లిపాక గ్రామ రైతులు, ప్రజలు శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. వందల ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా భూమికి హక్కులు కల్పించి పట్టాలు ఇప్పిస్తానని అదే గ్రామానికి చెందిన సాకా కృష్ణారావు 200 మంది రైతుల నుంచి రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశాడన్నారు. ఆ సొమ్ముతో ఆ భూమిని తన పేరు మీద, మరికొంత భూమిని కర్నూలుకు చెందిన మునిగేరు మదన్‌మోహన్ పేరుతో పట్టాలు పొంది పట్టాదారు పాస్ పుస్తకం టైటిల్ డీడ్ వంటి రెవెన్యూ హక్కులు పొంది తోటి రైతులను మోసం చేశాడన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



శంఖవరం కేజీబీవీలో విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డీఈఓ అన్నపూర్ణ

శంఖవరం: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈఓ అన్నపూర్ణ విద్యార్థులకు సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను శనివారం ఆమె పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. వసతిగృహం ద్వారా బాలికలకు అందిస్తున్న ఆహారం, ఇతర వసతులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెల 3 నుంచి 18 వరకూ నిర్వహించే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సీఎంఓ చామంతి వెంకటేశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలాకుమారి తదితరులు పాల్గొన్నారు.